సియోల్‌లో సీన్‌రివర్స్

I తరువాయి...

దక్షిణ కొరియా రాజధాని సియోల్ పర్యటనను ప్రకటించింది. 20 మందితో కూడిన మంత్రులు, విలేకరుల బృందం ఆదివారం హైదరాబాద్ నుంచి సియోల్‌కు మూడు రోజుల పర్యటన నిమిత్తం బయల్దేరింది. అయితే, ప్రభుత్వం తరపున ఏదైనా విదేశీ పర్యటన చేపడితే, ఒక ఎజెండా, ఆ దేశ ప్రతినిధులతో చర్చించాల్సిన అంశాలు, పర్యటించాల్సిన ప్రాంతాలు ఇలా సమస్త వివరాలను, ప్రణాళికలను ముందే సిద్ధం చేసుకుంటారు. దీనికి సంబంధించి ప్రకటనను కూడా విడుదల చేస్తారు. అయితే, సియోల్ పర్యటనలో అదేమీ కనిపించలేదు. చుంగ్ గై చున్ ప్రాజెక్టు మాత్రమే బృందం పర్యటించనున్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దీంతో మూసీ నదికి, సియోల్‌లో ప్రవహిస్తున్న చుంగ్ గై చున్ వాగుకు అసలు పోలికే లేదని, ఆ ప్రాజెక్టు ప్లానింగ్, మూసీ ప్రాజెక్టుకు ఏ మాత్రం సరిపోలదని మంత్రుల పర్యటనకు ముందే 'నమస్తే తెలంగాణ' రుజువులతో సహా ప్రచురించింది. అయినప్పటికీ, మంత్రుల బృందం టూర్‌ను ప్రారంభించింది.

సియోల్‌లో నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రులు పొంగులేటి, పొన్నం, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి

చుంగ్ వాగును చూశాక..

తొలిరోజు పర్యటనలో భాగంగా చుంగ్ గై చున్ వాగును చూసిన బృంద సభ్యులు ఒకింత షాక్‌కు గురైనట్టు ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్న వీడియోలను బట్టి అర్థమైంది. చుంగ్ వాగును చూశాక.. 'ఇది నది కాదు. పిల్ల వాగు' అని బృందంలోని ఒకరు, 'దీన్ని చూడటానికి ఇంత దూరం వచ్చామా?' అని మరో సభ్యుడు గుసగుసలాడుకొన్న వీడియో వైరల్‌గా మారింది. 'ఈ వాగుకు సుందరీకరణ కూడా అవసరంలేదు. ఇది మూసీకి పనికి రాదు' అని బృందంలోని మరో సభ్యుడు వాపోవడం గమనార్హం. దీంతో చుంగ్ వాగు పర్యటన ఫెయిలవ్వడంతో అక్కడి నుంచి బృందం.. సంగాయ్-డోంగ్‌లోని వ్యర్థాల దహన ప్లాంట్ ప్రాజెక్టును సందర్శించింది. రోజూ 1000 టన్నులు వచ్చే వ్యర్థాలను శుద్ధి చేసే సామర్థ్యం ఈ ప్లాంట్‌కు ఉన్నదని అబ్బురపడింది. అయితే, ఇంతకంటే గొప్ప ప్లాంట్ మన హైదరాబాద్‌లోనే ఉన్నదని, రోజుకు 1500 నుంచి 1600 టన్నుల చెత్తను శుద్ధిచేసి కరెంటు ఉత్పత్తి చేసే సామర్థ్యం దానికున్నదని బృందంలోని ఓ సభ్యుడు అనడంతో మిగతా వారంతా కంగుతిన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఆ ప్లాంట్ ఏర్పాటు జరిగిందని తేలడంతో ఏంచేయాలో పాలుపోని మంత్రులు అక్కడి నుంచి వడివడిగా కదిలినట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

షాక్ ఇచ్చిన హాన్ నది

చుంగ్ వాగు ఇచ్చిన షాక్ నుంచి తేరుకున్న మంత్రుల బృందం.. మూసీ పేరిట వచ్చిన ఈ టూర్‌ను ఎలాగోలా సక్సెస్ చేయాలని సియోల్ శివారుల్లో ప్రవహిస్తున్న హాన్ నదిని పర్యటించాలని నిర్ణయించుకున్నది. దీంట్లో భాగంగా హాన్ నది పరిసరాల్లో పర్యటించింది. కానీ, 'మూసీ పునరుజ్జీవ' ప్రాజెక్టుకు, హాన్ ప్రాజెక్టుకు ఎక్కడా పొంతనలేకపోవడం బృంద సభ్యులు గమనించారు. ఎందుకంటే, హాన్ ఓ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు. నీటి శుద్ధీకరణకు ప్రాధాన్యంలేదు. పైగా నది ఒడ్డున ఎత్తైన భవంతులు, వాణిజ్య సముదాయాలే కనిపించాయి. పైగా హాన్ నదిలోనే ఐల్యాండ్స్ ఏర్పాటు చేయడం, ఒడ్డున రివర్‌ఫ్రంట్ పేరిట పార్కులను నిర్మించడాన్ని పర్యావరణవేత్తలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు బృందం గ్రహించింది. హాన్ నదిలో చేపట్టిన కృత్రిమ నిర్మాణాలు నదీప్రవాహానికి అడ్డంకులు కలిగించి పర్యావరణంపై ప్రభావం చూపుతున్నట్టు స్థానికులు మండిపడుతున్నట్టు తెలియడం కూడా బృందాన్ని ఒకింత షాక్‌కు గురిచేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో హాన్ నది నుంచి కూడా బృందం వెనక్కి వచ్చేసింది.

మరేం చేద్దాం??

ఏ లక్ష్యం పేరుచెప్పి సియోల్ పర్యటనకు వచ్చామో.. అది ఫెయిల్ కావడంతో ఢీలా పడిపోయిన మంత్రుల బృందం అప్పటికప్పుడు రూట్ మార్చినట్టు సమాచారం. ఏదో ఒక పర్యటన చేయాలనుకున్న బృందం.. సియోల్ స్పోర్ట్స్ వర్సిటీని సందర్శించింది. హైదరాబాద్ శివారుల్లో ఫోర్త్‌సిటీలో 70 ఎకరాల్లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, తెలంగాణ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని సియోల్ వర్సిటీ ప్రతినిధులకు మంత్రుల బృందం విజ్ఞప్తి చేసింది. ఎంవోయూ కుదుర్చుకుందామని ఒత్తిడి చేసింది. అయితే, శిక్షణకు ఓకే గానీ, మిగతా విషయాలు తమ ప్రతినిధులతో చర్చించి చెప్తామని వర్సిటీవర్గాలు చెప్పడంతో బృందం మళ్లీ నీరసించిపోయినట్టు సమాచారం. సియోల్ పర్యటనలో స్పోర్ట్స్ వర్సిటీతో ఎంవోయూ కుదుర్చుకున్నామని గొప్పగా చూపెట్టాలనుకున్న మంత్రుల బృందానికి చివరకు నిరాశే మిగిలింది.

అందుకే డైవర్షన్ డ్రామా

మంత్రుల సియోల్ పర్యటన ఘోరంగా విఫలం అయ్యిందని అందరికీ అర్థం అయ్యింది. రూ. కోట్ల ప్రజాధనాన్ని ఇలాంటి పర్యటనల పేరిట ఖర్చు చేయడం ఏమిటని? రేవంత్ ప్రభుత్వాన్ని నెటిజన్లు నిలదీశారు. దీని నుంచి దృష్టి మళ్లించేందుకు దీపావళికి పొలిటికల్ బాంబులు అంటూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డైవర్షన్ డ్రామా మొదలు పెట్టినట్టు కనిపిస్తున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. పొలిటికల్ బాంబులేమో గానీ, సియోల్ బాంబు మాత్రం తుస్సుమన్నదని నెటిజన్లు ఎద్దేవా చేస్తున్నారు. కాగా.. చుంగ్ గై చున్ నది కాదు వాగు అని తేలడం, హాన్ పునరుజ్జీవ ప్రాజెక్టు కాదని రుజువవ్వడంతో ఇక చేసేదేమీలేక ఈ నదుల నమూనాలను మూసీకి అన్వయించబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరోక్షంగా పేర్కొనడం కొనమెరుపు.

వెళ్లింది ఎందుకంటే??

సియోల్‌లోని చుంగ్ గై చున్ వాగు, హాన్ నది పరిసరాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడిన బృందం పర్యటిస్తున్న సమయంలో అలాగే మూడు రోజుల కొరియా పర్యటనలో సభ్యుల మధ్య నీటి శుద్ధికి సంబంధించిన ఏ ఒక్క చర్చగానీ, మూసీ పక్షాళనకు సంబంధించి ఏ అంశంగానీ చర్చకు రాలేదు. చుంగ్ వాగు, హాన్ నది చుట్టుపక్కల నిర్మించిన భారీ భవనాలు, రియల్ ఎస్టేట్‌పై బృంద సభ్యుల మధ్య పెద్దఎత్తున చర్చ జరిగింది. నెట్టింట చక్కర్లు కొడుతున్న వీడియోలను బట్టి ఈ విషయం స్పష్టమవుతున్నది. 'సియోల్ నగరంలో ఉన్న విధంగానే మన హైదరాబాద్ నగరం మధ్యలో నుంచి నది ప్రవహిస్తుంది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇంతకు ముందు ఇక్కడికి టూర్‌కు వచ్చినప్పుడు ఈ విషయాన్ని తెలుసుకొని ఇప్పుడు మమ్మల్ని పంపించిండు. చుంగ్ గై చున్ పక్కనే రెస్టారెంట్లు, ఇవన్నీ (ఆకాశహర్మ్యాలు) వచ్చినయి. ఇవన్నీ పీపీపీ (పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం) విధానంలో కట్టిన ప్రాజెక్టులు. హైదరాబాద్‌లోని మూసీని కూడా ఇట్ల తయారు చేస్తే ప్రపంచవ్యాప్త గుర్తింపు వస్తుంది' అని భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొనడం దీనికి నిదర్శనం. అంటే.. మూసీ ఇరువైపులా చుంగ్ గై చున్ వాగు పరిసరాల లెక్క మారుస్తారని సదరు ఎంపీ అధికారికంగానే చెప్పినట్టు అర్థమవుతున్నది. మూసీ వెంట ఇంత పెద్ద ఆకాశహర్మ్యాలు రావాలంటే బఫర్‌జోన్ దాటి కిలోమీటర్ మేర విస్తరణ చేస్తారని మరోసారి చెప్పకనే చెప్పారు. ఇప్పటి వరకు రేవంత్ సర్కారు బయటికి బఫర్‌జోన్ వరకు ఉన్న 10 వేల నిర్మాణాలనే కూల్చుతామని చెప్తున్నా.. ప్రజాసంఘాలకు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో నదికి రెండు వైపులా కిలోమీటర్ మేర అభివృద్ధి చేస్తామని పొందుపర్చారు. తాజాగా సియోల్ పర్యటనలో మంత్రులు సైతం ఇదే విషయాన్ని ధ్రువీకరించారు. దీంతో మూసీ పునరుజ్జీవం కోసం మంత్రుల బృందం సియోల్ పర్యటన చేపట్టినట్టు కనిపించట్లేదని, మూసీ పరీవాహకంలో రియల్‌ఎస్టేట్‌ను ప్రోత్సహించడానికి కావాల్సిన స్ఫూర్తి పొందడానికే ఈ టూర్‌ను చేసినట్టు కనిపిస్తున్నదని మంత్రులు, ఎంపీల వ్యాఖ్యలను ఉటంకిస్తూ తెలంగాణవాదులు మండిపడుతున్నారు.

సియోల్‌లో పర్యటిస్తున్న పొంగులేటి, పొన్నం, చామల తదితరులు (ఫైల్)

మూడు రోజుల సియోల్ పర్యటనలో ఏం జరిగిందంటే?

తొలి రోజు: చుంగ్ గై చున్ వాగు, వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించాలనుకున్న మంత్రుల బృందం

షాక్ నంబర్ 1:

చుంగ్ గై చున్ వాగును చూశాక..

'ఓర్నీ..నది అనుకొనివచ్చాం. ఇదో పిల్లకాలువ. దీన్ని చూడటానికి ఇంత దూరం వచ్చామా? ఈ వాగు సుందరీకరణ మన మూసీకి అస్సలు సెట్ కాదు'

—బృందంలోని సభ్యుల గుసగుసలు

షాక్ నంబర్ 2:

వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ల సందర్శన తర్వాత..

బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్‌లో వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. వాటి సామర్థ్యం 1500 టన్నులు. అయితే, సియోల్‌లోని వ్యర్థాల ప్లాంట్ల సామర్థ్యం గరిష్ఠంగా 1000 టన్నులుగానే ఉన్నది. ఇది తెలిసి బృందంలోని సభ్యులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

రెండోరోజు: చుంగ్ గై చున్ ఫెయిల్ అవడంతో.. హాన్ నది సందర్శన

షాక్ నంబర్ 3:

చుంగ్ గై చున్ వాగు పర్యటన బెడిసికొట్టడంతో.. సియోల్ శివారుల్లోని హాన్‌నదిని పర్యటించాలని బృందం అప్పటికప్పుడు నిర్ణయించుకున్నట్టు విశ్వసనీయవర్గాల సమాచారం. అయితే హాన్ నది ప్రక్షాళనకు సంబంధించి ఏ వివరాలు బృందానికి లభించలేదు. ఎందుకంటే హాన్ రీజ్యువెనేషన్ ప్రాజెక్టు కాదు. అదో రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టు. పైగా నదిలో ఐల్యాండ్ల ఏర్పాటుతో పర్యావరణవేత్తల నుంచి తీవ్ర విమర్శలు ఎదురయ్యాయని తెలుసుకున్న బృందం ఒకింత షాక్‌కి గురైంది.

మూడోరోజు: నదులతో ఐతలేదని.. స్పోర్ట్స్ వర్సిటీ సందర్శన

షాక్ నంబర్ 4:

మూసీ పునరుజ్జీవం నమూనా కోసం వెళ్తే.. ఆ పని జరుగకపోవడంతో మంత్రుల బృందం రూట్ మార్చింది. అప్పటికప్పుడు క్రీడావర్సిటీని ఇందులో భాగంగానే సియోల్ స్పోర్ట్స్ వర్సిటీని సందర్శించిన బృందం.. తెలంగాణ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. ఎంవోయూ కుదుర్చుకుందామని ఒత్తిడి తీసుకొచ్చింది. అయితే, శిక్షణకు ఓకే గానీ, మిగతా విషయాలు తర్వాత అని వర్సిటీ ప్రతినిధులు చెప్పడంతో బృందం మళ్లీ నీరసించిపోయింది.

చివరగా బృందానికి నేతృత్వం వహించిన పొంగులేటి ఏమన్నారంటే??

> సియోల్‌లోని చిన్న (చుంగ్ గై చున్ వాగు), పెద్ద (హాన్ నది) నదుల పునరుజ్జీవ నమూనాలను మూసీకి అన్వయిస్తామా? లేదా? అన్నది ఇక్కడ ముఖ్యం కాదు. సియోల్ అభివృద్ధి మనకు పనికొస్తుందా? లేదా? అనే విషయంపై ఈ పర్యటన ద్వారా ఒక అవగాహనకు వచ్చాం.
>
> -మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

లోకం పోకడ

పోనీ, ట్రిపుల్ ఆర్‌ని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ పక్కనుంచి మళ్లిద్దామా సార్!

పేదల భూములపై కాంగ్రెస్ కుట్ర

నిషేధిత జాబితా పెట్టి సర్వత్రా గందరగోళం

రియల్ ఎస్టేట్‌ను నిర్వీర్యం చేసేలా విధానాలు

హైడ్రా, మూసీతో గగ్గోలు పెడుతున్న జనాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 24(నమస్తే తెలంగాణ): పైసా పైసా కూడబెట్టుకుని, పేద, మధ్యతరగతి వర్గాలు కొనుగోలు చేసుకున్న భూములే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. చెరువుల పరిరక్షణకు హైడ్రా పేరిట పేదల ఇండ్లను నేలమట్టం చేసింది. మూసీ ప్రక్షాళనతో బఫర్ జోన్, ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉన్న భూములు, నిర్మాణాలను టార్గెట్ చేసింది. తాజాగా భవిష్యత్ అవసరాలకు ఎప్పుడో కొనుగోలు చేసుకున్న ఓపెన్ ప్లాట్లకు ఎసరు పెట్టింది. కాంగ్రెస్ వేస్తున్న అడుగులు... పేదోడి సొంతింటి కలను కాలరాసేలా ఉన్నది. భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా వెంచర్లను నిషేధిస్తున్నట్టుగా జాబితా విడుదల చేసి గందరగోళానికి తెరలేపింది. అక్కడితో ఆగిపోకుండా... జాబితాను నేరుగా హెచ్ఎండీఏ వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్‌చేసి వివాదానికి తెరలేపింది. ఆయా లేఅవుట్లలో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తున్నారని ప్రచారం జోరందుకున్నది. కొనుగోలుదారులు కూడ భయాందోళనలతో హెచ్ఎండీఏ కార్యాలయానికి చేరుకోవడం... గుట్టుగా జాబితాను వెబ్‌సైట్ నుంచి తొలగించి చేతులు దులుపుకొన్నారు. కానీ హెచ్ఎండీఏ పేర్కొన్న 650కిపైగా లే అవుట్ల పరిస్థితి ఏమిటనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

కాంగ్రెస్ పాలనలో పేదల భూములకు రక్షణ లేకుండాపోయింది. అనధికారిక లే అవుట్ల పేరుతో కొనుగోలు చేసిన భూములను నిషేధిత జాబితా పేరిట భయాందోళనలకు గురి చేస్తోంది. ఏడు జిల్లాల్లో విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న జీపీ లే అవుట్లను రద్దు చేసింది. గతంలో డెవలప్ చేసిన లే అవుట్ల రిజిస్ట్రేషన్లు రద్దు చేయడం వలన కొత్త సమస్యలు పుట్టుకు వస్తున్నాయి. 2014 కంటే ముందే ఉన్న అనధికార లే అవుట్లతో కూడిన జాబితాను హెచ్ఎండీఏ ఇప్పటికే జిల్లాల వారీగా నివేదికరూపంలో విడుదలచేసింది. కానీ ఏనాడూ వీటి రిజిస్ట్రేషన్లను నిలిపివేయాలని సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సూచనలు జారీ చేయలేదు. తాజాగా విడుదలచేసిన జాబితాలోనూ 2014 కంటే ముందే ఉన్న వెంచర్లు, లేఅవుట్లు మాత్రమే ఉండగా... కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వంలో అధికారులు గుర్తించినవేవి లేవు. కానీ జాబితా పేరిట జనాల్లో గందరగోళం సృష్టించారు.

జాబితాను ఎందుకు తొలగించారు?

రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని మండలాల వారీగా సర్వే నెంబర్లు సహా రూపొందించిన జాబితాను హెచ్ఎండీఏ అధికారిక వెబ్‌సైట్‌లో ముందుగా అప్‌లోడ్ చేశారు. అయితే దీనిపై వ్యతిరేకత రావడం, హెచ్ఎండీఏకు వచ్చే బాధితుల సంఖ్య పెరగడం, సోషల్ మీడియాలో విస్తృత చర్చల కారణంగా అర్ధాంతరంగా జాబితాను హెచ్ఎండీఏ వెబ్‌సైట్ నుంచి తొలగించారు. ఉన్నఫళంగా ఎందుకు జాబితాను తీసివేశారనేది ఇప్పుడు పలు అనుమానాలకు తావిస్తోంది. జాబితా అప్‌లోడ్ చేసిన తర్వాత పాత వెంచర్ల వివరాలే అంటూ బుకాయించిన హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు ఇప్పుడూ ఎందుకు తొలగించాల్సి వచ్చిందనేది చర్చనీయాంశంగా మారింది. ఒకసారి జాబితాను విడుదల చేసి, ఆవెంటనే తొలగించడంతో అటు బిల్డర్లకు వేధింపులు పెరగడంతోపాటు, కొనుగోలుదారులకు నష్టభయం పట్టుకుంది. ఇక ఉన్న ప్లాట్ల క్రయవిక్రయాలు నిలిచిపోతే తమ పరిస్థితి ఏంటని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి.. జీపీ లే అవుట్ల విషయంలో జరుగుతున్న భయాందోళన చర్యలకు స్వస్తి పలకాలని, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కార్యకలాపాలను పునరుద్ధరించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మూసీ బాధితుల్లో పెయిడ్ అర్టిస్టులు

డబ్బు లిచ్చి ఆడోళ్ల తో తిట్టిస్తున్నరు

హైడ్రా, మూసీ బాధితులపై

వర్ధన్నపేట ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ఐనవోలు, అక్టోబర్ 24: హైడ్రా, మూసీ వద్ద కొందరు పెయిడ్ ఆర్టిస్టులను, ఆడోళ్లను పెట్టి తిట్టిస్తున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గురువారం హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం నందనం సొసైటీ ఆధ్వర్యంలో రాంనగర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ మధ్య కాలంలో ఎమ్మెల్యే తరచూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మంచి ఆలోచనతో హైడ్రా తెచ్చిందని అన్నారు. దేశంలో మంచి పెద్ద, పెద్ద సిటీలు నీళ్లల్లో ఉన్నాయని, ఒక మంచి ఉద్దేశంతో నాలాపై ఉన్న కుటుంబాలకు ఇళ్లు కట్టిద్దామనుకున్నామని తెలిపారు. మూసీ నదిని మంచిగా తీర్చిదిద్దామనుకుంటే, పెయిడ్ ఆర్టిస్టులు, ఆడోళ్లను పెట్టి తిట్టిస్తున్నారని పేర్కొన్నారు. పదేండ్లు ధ్వంసమైన చెరువులు, కుంటల గురించి అందరికి తెలుసు.. కబ్జాకు గురైన ప్రతి భూమిని వెలికి తీసేందుకు వరంగల్‌కు కూడా వాడ్రా వస్తుందని తెలిపారు.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

రెండో దఫా కూల్చివేతలు సాధ్యంకావు!

డబుల్ ఇండ్లలో సమస్యలు

తీవ్ర ఆగ్రహంలో మూసీ బాధితులు

ప్రభుత్వానికి అధికారుల నివేదిక

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ) : 'మూసీ జోలికి వెళ్లడం సాధ్యం కాదు. డబుల్ బెడ్‌రూంలు కేటాయించినప్పటికీ వారంతా తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. అక్కడ వసతులు ఏమీ బాగా లేవు. తాగునీటి సమస్య, లిఫ్ట్ పనిచేయకపోవడం.. అపరిశుభ్ర వాతావరణం ఉందని బాధితులు సమస్యలు ఏకరువు పెడుతున్నారు. రెక్కల కష్టంపై ఆధారపడే వాళ్లు రోజుకు పైఅంతస్థులు ఎక్కడం దిగడం కష్టంగా మారింది. బాల్కనీలో గ్రిల్స్ లేకపోవడం కూడా ప్రమాదకరంగా ఉంది. కిరాణా దుకాణాలు కూడా అందుబాటులో లేవు.' ఇలాంటి సమస్యలు ఉన్నాయని అధికారులు రిపోర్ట్ రెడీ చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో రెండో దఫా కూల్చివేతలు సాధ్యం కాదని అధికారులు కరాఖండిగా సర్కార్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఓ అధికారి వెల్లడించారు. ఇందులో భాగంగానే సెర్ప్ సీఈవో దివ్యదేవరాజ్ ఆధ్వర్యంలో మూసీ, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులంతా బుధవారం డబుల్ బెడ్‌రూంల్లో ఉంటున్న మూసీ బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అన్నీ వసతులు ఉంటాయని బలవంతంగా ఇక్కడికి రప్పించి మా కష్టాలను అధికారులు పట్టించుకోవడంలేదని దివ్యదేవ రాజన్ దృష్టికి తీసుకెళ్లారు. మాకు మూసీ ఇండ్లే నయమని అక్కడికి తిరిగి పంపించండి అని ఫాతిమా అనే మహిళ వేడుకున్నది. ఇండ్లు ఖాళీ చేస్తే ఇస్తామన్న పారితోషకం రూ.25వేలు ఇప్పటికీ అందలేదని వాపోయారు. బాధితుల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చి ఆ సమస్యల రిపోర్టును సర్కార్‌కు అందించినట్టు సమాచారం.

మూసీ బాధితుల జేఏసీ

మూసీ బాధితులు తమ ఇండ్లు కూల్చొద్దని చేస్తున్న ఉద్యమాలు బలాన్ని పుంజుకుంటున్నాయి. మూసీ పరివాహక ప్రాంతాలవాసులంతా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడిన విషయంపై ఆరా తీశారు. వారంతా తమ ఇండ్లను వదిలే ప్రసక్తే లేదని తీర్మానించుకున్నట్టు అధికారులు నోట్ చేసుకున్నారు.

హైడ్రాబాద్ @ హండ్రెడ్ డేస్

I తరువాయి...

జీవో 99 జారీ చేసింది. అప్పటి నుంచి ఆ సంస్థ వందలాది నిర్మాణాలను కూల్చివేసింది. ఈ నేపథ్యంలో హైడ్రా ఏర్పాటుతో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించినదేమిటి? ఈ సంస్థ ఏర్పాటు వెనుక మర్మమేమిటి?

నిజాం నాటి లేక్ సిటీ..

నిజాం కాలం నుంచి 90వ దశకం వరకు నగరంలో సుమారు 4వేలకుపైగా చెరువులు, కుంటలు, వాగులు, నాలాలు, మెట్ల, చేద బావులు ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. 1956 అంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు తర్వాత క్రమేణా అవి కాలగర్భంలో కలుస్తూవస్తున్నాయి. 1996లో నిర్వహించిన సర్వేలో ఏకంగా 3వేల వరకు నీటి వనరులు కనుమరుగైనట్టుగా తేలింది. శాటిలైట్ ఛాయాచిత్రాలతో చేసిన ఈ సర్వేలో 1004 నీటి వనరులు మాత్రమే ఉన్నట్టు నివేదికలో స్పష్టం చేశారు. పది హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలోని చెరువులు 169 మాత్రమేనని వెల్లడైంది. 2000 సంవత్సరంలో హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తడంతో చంద్రబాబు ప్రభుత్వం కిర్లోస్కర్ కమిటీని నియమించింది. ఈ కమిటీ నివేదిక ప్రకారం నగరంలో 1500 నాలాలు కబ్జాకు గురైనట్టుగా తేల్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి నగరంలోని 64 చెరువులకు మాత్రమే ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారు.

ఉరుము ఉరిమి పేదోడి మీద పడి...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి చెరువుల పరిరక్షణకు మొదటి అడుగుగా హైడ్రాను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ ఏర్పాటు జీవో రాకముందే కూల్చివేతల పర్వాన్ని ప్రారంభించారు. తుపాకీని తొలుత రాజకీయంగా ఎక్కుపెట్టి.. ఆపై అనేక అయోమయాల మధ్య సామాన్యుడి మీద తూటాల వర్షం కురిపించారు. అవుటర్ రింగు రోడ్డు వరకు పరిధి అని అమలులోకి వచ్చిన హైడ్రా ఇప్పటివరు 23 చోట్ల 262 నిర్మాణాలను కూల్చివేసింది. ఈ కూల్చివేతలకే రూ.10-15 కోట్ల వరకు ఖర్చు చేశారని సమాచారం. ఈ కూల్చివేతల్లో అత్యధికంగా గాజుల రామారంలోని చింతల్‌చెరువుల ఒడ్డున 54 నిర్మాణాలను కూల్చేశారు. రాజేంద్రనగర్‌లోని భూమురక్‌డౌలాలో 45 నిర్మాణాలు ఉన్నాయి. ఇదే క్రమంలో లోటస్‌పాండ్, మన్సూరాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బాచుపల్లి, చందానగర్, అమీర్‌పేట, అమీన్‌పూర్, గుట్టల బేగంపేట, మల్లంపేటలలో పలు నిర్మాణాలను నేలమట్టం చేశారు. కత్వా చెరువు పరిధిలోని నిర్మాణాలను ఏకధాటిగా 17 గంటల పాటు కూల్చివేశారు.

పెద్దలవి గోరంత... పేదోళ్లవే అంతా!

హైడ్రా కూల్చివేతల్లో ప్రధానంగా కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు సోదరుడు పల్లం ఆనంద్‌కు చెందిన ఏరో స్పోర్ట్స్ నిర్మాణాలను కూల్చివేశారు. మాదాపూర్‌లో సినీ హీరో నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేశారు. ఇక జాబితాలో ప్రధానమైన వాళ్లలో కావేరీ సీడ్స్ అధినేత జీవీ భాస్కర్‌రావుకు చెందిన నిర్మాణం ఉంది. ఇది హైడ్రా పరిధి కాకపోయినా కూల్చివేతలు చేపట్టడం వెనక ఆంతర్యమేమిటో ఇప్పటికీ అటు ప్రభుత్వం, ఇటు హైడ్రా స్పష్టం చేయలేదు. అమీన్‌పూర్‌లో విల్లాలు అని పేరే గానీ అవి సాధారణ నిర్మాణాలే. సున్నం చెరువులో అత్యంత నిరుపేదల నివాసాలను కూల్చివేయడంతో ఇప్పటికీ వాళ్లు శిథిలాల మధ్యనే కాలం గడుపుతున్నారు. తాత్కాలిక గుడిసెలు వేసుకుని రోడ్డుపక్కన జీవిస్తున్నా... అది కూడా ఖాళీ చేయాలని హైడ్రా హుకూం జారీ చేసింది.

నల్ల చెరువు పరిధిలో కూల్చివేతల దృశ్యం (ఫైల్)

భట్టి కోర్టులోకి హైడ్రా బంతి...

రేవంత్ ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేస్తూ జారీ చేసిన జీవో 99లో హైడ్రా పరిధితో పాటు చైర్మన్‌గా వ్యవహరించే సీఎం సహా 12 మంది పాలకమండలిని స్పష్టంగా పేర్కొన్నారు. ఇందులో డిప్యూటీ సీఎం పేరు లేదు. కానీ కొన్నిరోజులుగా భట్టి విక్రమార్క చెరువులతో పాటు హైడ్రా అంశాలపై ప్రత్యేక దృష్టిసారించడం చర్చనీయాంశంగా మారింది. కొన్నిరోజుల కిందట హైడ్రా కమిషనర్ రంగనాథ్ భట్టిని కలవడం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. మేడ్చల్ జిల్లా పరిధిలో 20 చెరువుల సర్వే పూర్తి కావడంతో ఆ వివరాలను రంగనాథ్ డిప్యూటీ సీఎంకు వివరించినట్టు తెలిసింది. దీంతో పాటు బీజేపీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రజెంటేషన్‌లోని కొన్ని చెరువుల వివరాలను కూడా భట్టి ముందు ఉంచినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఇవి కాదు.. హెచ్ఎండీఏ పరిధిలో చెరువులన్నింటినీ సర్వే చేయాలని నిర్ణయించినందున ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు కూల్చివేతల జోలికి వెళ్లొద్దని ఆదేశించినట్టుగా ప్రచారం జరుగుతుంది. మరి... సీఎం చైర్మన్‌గా ఉండే హైడ్రా డిప్యూటీ సీఎంకు ఎందుకు రిపోర్ట్ చేస్తుందనేదే ఇప్పుడు అధికారవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హైడ్రాతో తెలంగాణ రియల్-నిర్మాణ రంగం కుదేలవడంతో అప్రమత్తమైన కాంగ్రెస్ అధిష్ఠానం నష్టనివారణ చర్యలు చేపట్టిందనేది రాజకీయవర్గాల్లో సాగు